www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 43 | 09-08-2021 | పుటలు : 4




స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు !!
- నన్నయవాణి

## నాక్ సాధనకు కృషి చేయండి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**05.08.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు కోసం చేస్తున్న ప్రయత్నాలు వేగవంతం చేయాలని నాక్ సాధనకు సమష్టిగా కృషి చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. గురువారం యూనివర్సిటీ నాక్ కమిటీ సభ్యులతో వీసీ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాని నాక్ గుర్తింపుఎంతో అవసరమని ప్రతీ ఒక్కరూ నాక్ సాధన కోసం పని చేయాలని అన్నారు. నాక్ ద్వారా అనేక నిధులు సమకుర్చుకొని విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని చెప్పారు.కాబట్టి కొవిడ్ సమయంలో కూడా పనులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కమిటీ సభ్యులు నాక్ మార్గదర్శకాలను అనుసరించి సెవెన్ క్రైటీరియాలకు సంబంధించిన సమాచారాలను సిద్దంచేసుకొని ఉంచాలని చెప్పారు. సెల్ఫ్ స్టడీ రిపోర్ట్(ఎస్.ఎస్.ఆర్.) ద్వారా 70 శాతం మార్కులువస్తాయని కాబట్టి నాక్ కమిటీ సభ్యులు రిపోర్ట్ కు కావాల్సిన సమాచారాన్ని చక్కగా ప్రదర్శింపచేయాలని తెలియజేశారు. సమష్టి కృషితో నాక్ గుర్తింపు సాధించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. నాక్ సాధనకు అవసరమైన పలు కీలక అంశాలపై దిశానిర్ధేశం చేశారు. ఎస్.ఎస్.ఆర్. లోబోధన ప్రమాణాలు, పరిపాలన, పరిశోధనలు, విద్యార్థుల భాగస్వామ్యం వంటి 7 ప్రధాన అంశాలపై జరుగుతున్న పనితీరుపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, నాక్ ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, డా.పి.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

## కళాశాలల్లోపచ్చదనాన్ని పెంపొందించండి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు


వన మహోత్సవంలో మొక్కలు నాటుతున్న వీసీ జగన్నాథరావు

**05.08.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు.ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జగనన్న పచ్చతోరణం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కోవిడ్ కాలంలో ఆక్సిజన్ అందక అనేక మంది ప్రాణాలను కోల్పోయారని ప్రాణాధారమైన ఆక్సిజన్ అందించే మొక్కలను నాటడంపై అందరూ ప్రత్యేక శ్రద్ద వహించాలని అన్నారు. రాష్ట్రంలో విరివిగా మొక్కలను నాటే బృహత్తర లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాలు హర్షణీయమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలలో విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు భాగస్వామ్యం కావాలని చెప్పారు. ప్రతీ కళాశాలలోను మొక్కలనునాటి వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. దీనిపై స్పందించిన యూనివర్సిటీ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు ప్రతీ కళాశాలలోను వేయి మొక్కలను నాటాలని తీర్మానాన్ని చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, మేనేజ్మెంట్అసోసియేషన్ నాయకులు టి.కె.విశ్వేశ్వరరెడ్డి, ఎన్.వి.రమణరావు, కె.నరసింహారావు, ఎం.డి.హబీబ్ బాషా, జి.వి.రావు, ఆశీర్వాదం మరియు ఉభయగోదావరి జిల్లాల్లోని మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నన్నయ అభివృద్ధే జక్కంపూడికి నివాళి

### వై.ఎస్.ఆర్, జక్కంపూడి పేరుతో మల్టిపర్పస్ హాల్ నిర్మిస్తాం

### వీసీఆచార్య మొక్కా జగన్నాథరావు

**06.08.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ స్థాపనకు విశేష కృషి చేసిన మహనీయుడు జక్కంపూడి రామ్మోహనరావు చిరస్మరణీయులని, నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధే జక్కంపూడికి నిజమైన నివాళి అని వీసీఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాల్ లో గురువారం జక్కంపూడి రామ్మోహనరావు 68 వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తెలుగురాష్ట్రాలలో ప్రజానాయకుడుగా జక్కంపూడి రామ్మోహనరావు ఒక ప్రత్యేక గుర్తింపును సంపాధించుకున్నారని, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో రామ్మోహనరావు ఔనత్యాన్ని గురించి తరచూ వినే వారమని అన్నారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు కృషి ఫలితంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరంలో ఏర్పాటు అయిందన్నారు. అందరికీ ఉన్నత విద్యను అందించాలనే మహనీయుల ఆశయాలకు అనుగుణంగా మనమంతా సమష్టిగా కృషి చేసి విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల ఉన్నత విద్యాకేంద్రమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయ పైలాన్ ను తిరిగి నిర్మిస్తామన్నారు. డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి,జక్కంపూడి రామ్మోహనరావు మల్టీపర్పస్ సెమినార్ హాల్ భననాన్ని విశ్వవిద్యాలయ ప్రాగణంలో నిర్మిస్తామని చెప్పారు. మహనీయుల ఆశయాలను ఆచరణాత్మకంగా ముందుకు తీసుకువెళ్ళేందుకు,విశ్వవిద్యాలయాన్ని ప్రగతిపథంలో నడిపేందుకు అందరూ సహకరించాలని కోరారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో సహాయ సహకారాలందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి ,వారి కుటుంబ సభ్యులకు వీసీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య పి.సురేష్ వర్మ, డా.కె.రమణేశ్వరి, డా.డి.జ్యోతిర్మయి, ఎస్.లింగారెడ్డి, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, అధ్యాపకులు డా.మల్లిభాస్కర్,డా.ఎం.గోపాలకృష్ణ, డా.తలారివాసు, ఎ.ఎం.శిరీష తదితరులు అభిప్రాయాలను తెలియజేశారు.


జక్కంపూడి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న వర్సిటీ అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ మొక్కా జగన్నాథరావు

# సంపాదకీయం




## పంద్రాగస్టు

స్వేచ్ఛ కోసం ఉద్యమాల జెండా పట్టిన జాతి.స్వరాజ్య నిధి కోసం ఒంటి మీద ఆభరణాల్ని ఒలిచి ఇచ్చిన జనం. హక్కుల కోసం గొంతెత్తిన సమూహాలు.నాటి పరాయి పాలన సెగ మధ్యతరగతి ప్రజలకే ముందుగా తాకింది.ధరలు మండి పోయాయి.కరవు రాజ్యమేలింది.ఉపాధి అవకాశాలు సరిగాలేవు. దానికితోడు వివక్షను భరించలేని స్థితి.విముక్తి అనివార్యమన్న నిర్ణయానికొచ్చారు.ఆ కలను నిజం చేసుకునే ప్రయత్నంలో ఒకదశలో అతివాదుల్ని నమ్మారు.మరొకదశలో మితవాదులకు మద్దతిచ్చారు.తర్వాత గాంధీజీ సిద్ధాంతాలకు గుండెల్లో చోటిచ్చారు.

పోరాటమంటేనే పెద్ద ప్రశ్న.ప్రశ్నే ఉద్యమానికి ఆయువుపట్టు.ప్రశ్నే పది తూటాల పెట్టు.జాతీయోద్యమానికి విరాళాలు సేకరించే సందర్భంలో...బంగారం ముఖ్యమా,స్వేచ్ఛ ముఖ్యమా అనే సందేహం తలెత్తినప్పుడు 'స్వేచ్ఛే' ముఖ్యమని ప్రజలు జవాబిచ్చారు.తామే దేశమని,దేశమే తామని భావించారు.తెల్లదొరలు దేశాన్ని కొల్లగొడుతుంటే కుత కుత ఉడికిపోయారు.ఇది మా దేశం.మేమే పాలించుకుంటామని నినదించారు.బలమైన ప్రజా భాగస్వామ్యం ఉంటే ఎన్ని అద్భుతాలు జరుగుతాయో అన్నీ జరిగాయి.”మనం”అనే భావనలోని మహత్తు అదే!త్యాగాలకు సిద్ధపడ్డారు. *1947* పంద్రాగస్టుకి అర్ధరాత్రి అరుణోదయం చూశారు.

పాఠ్య పుస్తకాల్లో జాతీయోద్యమ పోరాట చరిత్రను చదువుతుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.సామాన్యుల త్యాగాల గాథల్ని తలచుకుంటే గుండె ఉప్పొంగుతుంది.

'అవరోధాలు వస్తుంటాయి.వైఫల్యాలు ఎదురవుతుంటాయి.కుట్రాలూ, కుతంత్రాలు పోరాటాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తుంటాయి. అయినాసరే, సహనాన్ని కోల్పోకూడదు. సహనాన్ని కోల్పోతే విజయాన్ని కోల్పోయినట్లే'నంటారు గాంధీజీ.' సహనమే సంస్కృతి' అంటారు రాధాకృష్ణన్. నాటి జాతీయ నాయకుల నుండి నేర్చుకోవలసిన ముఖ్య విషయం... వ్యక్తిగత విరోధాల్ని, సైద్ధాంతిక వైరుధ్యాల్ని ఒకే రాటన కట్టలేం. భావవ్యక్తీకరణ హుందాగా ఉండాలి. పలికే భాషలోనూ, రాతల్లోనూ సభ్యత నిండి ఉండాలి.

వర్తమానాన్ని పరిపూర్ణంగా అనుభవించటానికి, రాబోయే కాలాన్ని మహత్తరంగా తీర్చిదిద్దుకోవటానికి ఒకసారి వెనక్కి తొంగిచూస్తాం. అదే “చరిత్ర”అంటే! చరిత్రను అధ్యయనం చేయకపోతే గెలుపుఓటముల, బలాబలాల తీరును, స్థాయిని తెలుసుకోలేం.

విదేశీ వస్తు, సంస్కృతీ వ్యామోహాల్ని వదిలి నా దేశం,నా భాష,నా సంస్కృతి అనే ఆత్మాభిమానాన్ని కలిగి గత వైభవ స్ఫూర్తితో జీవించటమే మనం చేయగలిగిన పని.ఏ జాతి ముంగిట అయినా ఉండేవి రెండే మార్గాలు.ఒకటి చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకుని చరిత్రను సృష్టించటం.చరిత్రను విస్మరించి చరిత్రలో కలసిపోవటం.ఏ దారిని ఎన్నుకుంటామో అదే రేపటి పుటల్లో చరిత్ర మన స్థానాన్ని లిఖిస్తుంది.వ్యక్తిగతంగా మనిషి ముందు కూడా రెండు మార్గాలుంటాయి.మంచి - చెడు.ఏది ఎన్నుకొని ముందుకెళ్తాడో అదే అతని స్థాయిని నిర్ణయిస్తుంది.చరిత్ర దానినే లిఖిస్తుంది.


# గీతాంజలి - టాగోర్

పుస్తకం

**టాగోర్ - గీతాంజలి (ఆసియా ఖండంలో మొదటిసారి నోబెల్ బహుమతి పొందిన కవితా సంకలనం)**

కొన్ని కొన్ని ఖండికలుగా చదివినా మనస్సును ఆహ్లాదపరిచే ఒక మంచి గొప్ప పుస్తకం గీతాంజలి.


రవీంద్రుని రచనలలో గీతాంజలి చాల గొప్పది. రవీంద్రుడు తాను బెంగాలీ భాషలో రచించిన భక్తిగీతాలను కొన్నింటిని ఆంగ్లంలోనికి అనువదించి గీతాంజలి అని పేరు పెట్టారు.అది అనేక ప్రపంచ భాషలలోనికి అనువదించబడింది. ప్రపంచ సాహిత్యంలో ఇది గొప్ప రచన. మానవుని కృంగదీసే నిరాశా నిస్పృహలను, సకల సృష్టిని ప్రేమభావంతో చూచి శ్రమ యొక్క గొప్పతనాన్ని సూచించే మహత్తర సందేశం గీతాంజలిలోని ముఖ్యాంశం. 1913 వ సంవత్సరంలో సాహిత్యానికి సంబంధించి రవీంద్రుని గీతాంజలికే నోబెల్ బహుమతి లభించింది. విశ్వకవి అనే బిరుదును సాధించి పెట్టింది. గీతాంజలి వెలువడినతరువాత అన్ని దేశాలవారు రవీంద్రుని గ్రంథాలను చదవడం ఆరంభించారు. రవీంద్రుని జీవితంలో ముఖ్యంగా వ్యక్తిగత జీవితంలో చూసిన విషాదం, చోటు చేసుకున్న ఆప్తుల మరణాలు, దైవంతో లేదా ప్రకృతితో లేదా తనలోని ఒక ఔన్నత్యమైన ఆత్మతో లేదా సృష్టిలో అణువణువూ నిండి ఉన్న తేజోశక్తితో లేదా ఒక ఊహామాత్రపు సఖుడితో లేదా ప్రియురాలితో సంభాషణకు పురిగొలిపి ఉండవచ్చు. నివేదించుకునే క్షణాలు, కనుకొలకుల్లోంచి అశ్రువులను దిగవిడిచే క్షణాలు, వేదన, ఉచ్ఛ్వాస నిశ్వాసలను ఆశించే క్షణాలు, స్వచ్ఛమైన సుమం వలే తటస్థ కొలనులోని లేశమాత్రపు అలవలె మారి స్థిమిత పడే క్షణాలు, ప్రభూ... కురవని జల్లుల భారంతో వొంగిన మేఘంలాగా నా మనసు నీ ద్వారం వద్ద నమ్రతతో ప్రమాణం చేయనీ అని మొరపెట్టుకునే క్షణాలు, మృత్యువు కొరకు పరమాద్భుత రుచి కలిగిన తేనెతో ఎదురు చూసే క్షణాలు... ఇవన్నీ కవిత్వంగానే మారితీరాయి.తెలుగులో ఎన్నో అనువాదాలు వచ్చాయి.గీతాంజలికి చలం అనువాదం విశేషమైంది.




- డా.ఎస్. ప్రభాకర్

# నానో టెక్నాలజీదే భవిష్యత్

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ మొక్కా జగన్నాథరావు

**04.08.21 (మీడియాసెల్)** శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నానో టెక్నాలజీ కీలక పాత్రను పోషిస్తుందని, భవిష్యత్ లో అన్ని రంగాల్లోను నానో టెక్నాలజీని ఉపయోగిస్తారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం “అగ్రి నానో టెక్నాలజీస్ అండ్ డైలెక్ట్రిక్ మెటీరియల్స్” అనే అంశంపై నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. ఫిజిక్స్ విభాగాధ్యాపకురాలు డా.ఎస్.రాజ్యలక్ష్మి కన్వీనర్ గా వ్యవహరించిన ఈ వెబినార్ కు ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. వీసీ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో నానో టెక్నాలజీకి డిమాండ్ ఎక్కువగా ఉందని అన్ని రంగాల్లో నానో టెక్నాలజీ విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందని అన్నారు. నానోటెక్నాలజీ ఆధునిక వ్యవసాయంలో కొత్త మార్పులను తీసుకువస్తుందని చెప్పారు. అగ్రి-నానోటెక్నాలజీ ఆహారం యొక్క ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఉత్పత్తి, భద్రత, వాతావరణ మార్పు, రవాణా వంటి అనేక వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ అంశాలపై నానోటెక్నాలజీ ఉపయోగ పడుతుంది. వ్యవసాయ ఉత్పత్తులు, రక్షణ కోసం నానోపార్టికల్స్ వివిధ రూపాలలో ప్రయోగిస్తున్నారు. నానోటెక్నాలజీ శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు వ్యవసాయ రంగంలో కూడా ఎన్నో ప్రయోజనాలను చేకూర్చుతుంది. దీనిపై మరిన్ని లోతైన పరిశోధనలు జరిగి సమాజహితంగా నానో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రిసోర్స్ పర్సన్స్ గా ఆచార్య ఎన్.జి.రంగ అగ్రికల్చర్ యూనివర్సిటీ తిరుపతి ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా.టి.ఎన్.వి.కె.వి ప్రసాద్, గీతమ్ స్కూల్ ఆఫ్ సైన్సెస్ హైదరాబాద్ సహాయాచార్యులు డా.టి.విశ్వం హాజరై అగ్రి నానో టెక్నాలజీస్ అండ్ డైలెక్ట్రిక్ మెటీరియల్స్ పై పలు ఆసక్తికర విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ మెంబర్స్ ఆచార్య కె.శ్రీరమేష్, డా.బి.జగన్మోనహరెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, కన్వీనర్ డా.ఎన్.రాజ్యలక్ష్మి, కోకన్వీనర్స్ డా.వై.సుష్మప్రియ, వి.రాజశేఖర్, స్పృహ అలుమ్ని అసోసియేషన్ సుంకర నాగేంద్ర కిషోర్, వెబ్ మాస్టర్ మంచెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జయహో...! నీరజ్.

నీవే...రాజు!! సువర్ణ...రాజు!!

శుభాకాంక్షలు!

నీరజ్... నీకు అక్షర నీరాజనం!!

- నన్నయవాణి



## మంచి మాట

నా దృష్టిలో రాజీపడటాన్ని మించిన నేరం లేదు.అది విలువల విషయంలో కావచ్చు.స్వేచ్ఛ విషయంలో కావచ్చు. అన్యాయంతోనో,అక్రమంతోనో అయినా కావచ్చు.భవిష్యత్తు పట్ల నమ్మకాన్ని కోల్పోయినప్పుడే రాజీపడాలన్న ఆలోచన వస్తుంది.ఆ పరిస్థితి ఎప్పుడూ తెచ్చుకోకూడదు.

- సుభాష్ చంద్రబోస్

# సహజ వనరుల లభ్యతపై అవగాహన పెంచుకోండి

**ఓ.ఎన్.జి.సి.మాజీ జనరల్ మేనేజర్ సి.వి.రావు**



సమావేశంలో మాట్లాడుతున్న సి.వి.రావు.

**03.08.21 (మీడియాసెల్)** జియోలజీ, జియోఫిజిక్స్ పరిశోధకులు, విద్యార్థులు సహజ వనరుల లభ్యతపై అవగాహన పెంచుకోవాలని ఓ.ఎన్.జి.సి. మాజీ జనరల్ మేనేజర్ సి.వి.రావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్టమెంట్ ఆఫ్ జియోలజీ, స్టూడెంట్స్ ఛాప్టర్, సోసైటీ ఆఫ్ పెట్రోలియం,జియోఫిజిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. "సంప్రదాయేతర శక్తి వనరులు – భారతీయ ధృక్పథము" అనే అంశంపై జరిగిన ఈ సదస్సుకు కన్వీనర్ గా జియోలజీ విభాగ సహాచార్యులు డాక్టర్ కె.వి.స్వామి వ్యవహరించారు. కీలకోపన్యాసకులుగా ఓ.ఎన్.జి.సి. జనరల్ మేనేజర్ సి.వి.రావు మాట్లాడుతూ జియోలజీ మరియు జియోఫిజిక్స్ విద్యార్థులు, పరిశోధకులు సంప్రదాయేతర చమురు, గ్యాస్ శక్తి వనరుల లభ్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ వనరులు ఎలా గుర్తించాలో, వెలికితీయడంలో ఎదురయ్యే సవాళ్ళను వివరించారు. సహజవనరుల లభ్యతకు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ విధంగా ఉపయోగించవచ్చుననే అంశాలను క్షుణంగా తెలియజేశారు.నేషనల్ జియోఫిజిక్స్ రిసెర్చ్ ఇన్సిట్యూట్ హైదరాబాద్ నుండి సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా.నిమిషావేదాంతి మాట్లాడుతూ తూర్పు భారతదేశం లోని గోండ్వానా బేసిన్లలో బొగ్గు, మీథేన్ మరియు షేల్ గ్యాస్ యొక్క అన్వేషణ పై పలు అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా. ఎన్.సత్యవాణి లు గ్యాస్ హైడ్రేట్ల అన్వేషణలో భూకంప పద్ధతులను వివరించారు. కన్వీనర్ డా. కె.వి.స్వామి మాట్లాడుతూ జియోలజీలో అపార అనుభవం కలిగిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ రావు ప్రోత్సాహంతో నేషనల్ వెబినార్లు నిర్వహిస్తూ విద్యార్థులను పరిశోధనలవైపు నడిపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ డా.కె.నూకరత్నం, విభాగాధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# నన్నయలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్




ఎస్.బి.ఐ. మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

**08.08.21 (మీడియాసెల్)** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ను ఆదివారం నిర్వహించారు. డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయం ఎదురుగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఎస్.బి.ఐ రీజినల్ మేనేజర్ ఎ.ఎన్.వసంత మొక్కలను నాటి మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సహంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని పచ్చని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. యూనివర్సిటీ గ్రీనరీ డెవలప్మెంట్ లో అటవీశాఖ అధికారులను, కడియం నర్సరీల యాజమాన్యాలను భాగస్వామ్యం చేశామన్నారు. యూనివర్సిటీలో బోటనీ విభాగం ఆధ్వర్యంలో బొటానికల్ గార్డెన్ ను ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో కాకినాడ క్యాంపస్ లో బయోడైవర్సిటీ పార్క్, మ్యూజియంలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీసీ పర్యవేక్షణలో అన్ని వనరులను ఉపయోగించుకొని యూనివర్సిటీ గ్రీనరీ డెవలప్మెంట్ కు పాటుపడుతున్నామని చెప్పారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు నిర్వహిస్తున్న మెగా ప్లాంటేషన్ డ్రైవ్ హర్షణీయమని, పర్యావరణ పరిరక్షణకు ఎస్.బి.ఐ. సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఎస్.బి.ఐ. రీజినల్ మేనేజర్ ఎ.ఎన్.వసంత మాట్లాడుతూ ఎస్.బి.ఐ. చీఫ్ జనరల్ మేనేజర్ సంజయ్ సహాయ్ నేతృత్వంలో, రాజమహేంద్రవరం పరిపాలన కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ సురేష్ ప్రభుత్వ సహకారంలో ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ను నిర్వహించి 500 మొక్కలను నాటు తున్నామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎస్.బి.ఐ. ఆధ్వర్యంలో రాష్ట్రం వ్యాప్తంగా 25000 మొక్కలను నాటేందుకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహణకు అవకాశం కల్పించిన వీసీ, రిజిస్ట్రార్, విశ్వవిద్యాలయ అధికారులకు కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.సురేష్ వర్మ, డా.పి.వెంకటేశ్వరరావు, డి.జి.ఎం. ఎస్.సురేష్ ప్రభు, అధ్యాపకులు డా.ఎం.గోపాలకృష్ణ, డా.కె.శామ్యూల్, డా.బి.రామ్ గోపాల్, రీజినల్ మేనేజర్ ఎ.ఎన్.వసంత, ఎ.జి.ఎం. ఎన్.సాయి మోహన్, ఛీఫ్ మేనేజర్ కె.విజయ్ కుమార్ మరియు లోకల్ బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యాభివృద్ధికి సమిష్టిగా కృషిచేద్దాం..

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు





సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**03.08.21 (మీడియాసెల్)** ఉన్నత విద్యాభివృద్ధికి ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు సమష్టిగా కృషి చేయాలని, విశ్వవిద్యాలయం పూర్తి సహకారాన్ని అందిస్తుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల మేనేజ్మెంట్ అండ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆన్లైన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో మేనేజ్మెంట్ అండ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ నాయకులు పలు అంశాలను, సమస్యలను వీసీ మొక్కా జగన్నాథరావు దృష్టికి తీసుకువచ్చారు. వాటిలో ప్రధానంగా కాలేజీలకు ఎక్స్టెన్షన్ ఆఫ్ అప్రూవల్(EoA), ఎక్స్టెన్షన్ ఆఫ్ పర్మిషన్(EoP) విషయమై ఉన్నత విద్యామండలికి సిఫార్సు చేయాలని కోరారు. పర్మినెంట్ ఎఫిలియేషన్ ఫీజులు మరియు పరీక్ష ఫీజులను తగ్గించాలన్నారు. ఆయా కళాశాలలు విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ తో జరిపే లావాదేవీలను ఆన్లైన్ పేమెంట్స్ చేసే సదుపాయం కల్పించడం వంటి పలు విషయాలను వీసీ దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై సానుకూలంగా స్పందించిన వీసీ ఆచార్య జగన్నాథరావు మాట్లాడుతూ యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ కు డిజిటల్ ట్రాన్సెక్షన్ సదుపాయం కల్పిస్తామన్నారు. పర్మినెంట్ ఎఫిలియేషన్ ఫీజులు మరియు పరీక్ష ఫీజుల విషయమై యూనివర్సిటీ సీడీసీ, పరీక్షా విభాగాల అధికారులతో చర్చించి తగ్గించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈఓఎ, ఈఓపి విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలియజేశారు. కళాశాలలు యూనివర్సిటీతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకొని పని చేయడం మంచి పరిణామమని అన్నారు. విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలలు ఉభయగోదావరి జిల్లాల్లోని ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కోవిడ్ సమయంలో ఆయా కళాశాలలు నిర్వహించిన ఆన్లైన్ తరగతుల విషయమై వీసీ ఆరా తీశారు. ప్రస్తుతం పీజీ పరీక్షలు జరుగుతున్నాయని త్వరలో డిగ్రీ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని కోవిడ్ నింబంధనలను పాటిస్తూ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఉన్నత విద్యాభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి, కళాశాలల ప్రగతికి విశ్వవిద్యాలయ సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు.యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ డా.ఎం.కమలకుమారి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలలు ఆన్లైన్ తరగతులను పూర్తి స్థాయిలో నిర్వహించాలని, దానికి సంబంధించిన సమాచారాన్ని సి.డి.సి. కి తెలియజేయాలని చెప్పారు. కోవిడ్ ను దృష్టిలో పెట్టుకొని అన్ని కోర్సులకు సంబంధించిన పాఠ్యాంశాలను లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్(ఎల్.ఎల్.ఎస్.) పేరుతో యూనివర్సిటీ వెబ్ సైట్ లో అప్లోడ్ చేస్తున్నామని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం యూనివర్సిటీ ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపుకు కృషి చేసిన వీసీ మొక్కా జగన్నాథరావుకు మేనేజ్మెంట్ అండ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ తరుపున అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ డా.ఎం.కమలకుమారి, అసోసియేట్ డీన్ డా.పి.వెంకటేశ్వరరావు, ఫ్యాకల్టీ అసోసియేట్స్ డా.పి.రాజశేఖర్, డా.సుష్మ ప్రియ ,మేనేజ్మెంట్స్ అసోసియేషన్స్ రాష్ట్ర నాయకులు మరియు వైస్ ప్రెసిడెంట్ కె.నరసింహారావు, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.కృష్ణవర్మ, మేనేజ్మెంట్ అసోసియేషన్స్ నాయకులు వి.జనార్ధనరావు, మేనేజ్మెంట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ హబీబ్ బాషా, యూనివర్సిటీ వెబ్ మాస్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# ఇంజనీరింగ్‌లో అవకాశాలను అందుకోండి

## ఫెలో ఐ.ఇ.టి.ఇ. సీనియర్ మెంబర్ కిన్నెర

**04.08.21 (మీడియాసెల్)** కిరణ్ ఇన్స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్ లో సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఫెలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ఇంజనీర్స్ సీనియర్ మెంబర్ కిన్నెర కిరణ్ తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, డిపార్టమెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో మంగళవారం నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. ఇన్స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్ లో సవాళ్ళు మరియు అవకాశాలు" అనే అంశంపై జరిగిన ఈ నేషనల్ వెబినార్ కు అధ్యక్షులుగా ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కన్వీనర్ గా జె.హనుమంతు వ్యవహరించారు. రిసోర్స్ పర్సన్ గా హాజరైన కిన్నెరకిరణ్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ప్రక్రియలో కొత్తగా వస్తున్న మార్పులు, సవాళ్ళు గురించి వివరించారు. యంత్రాలను ఉపయోగించడంలో ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీర్ల పాత్రను అవసరాన్ని తెలియజేశారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విద్యార్థులకు, పరిశోధకులకు ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను తెలియజేసి మార్గ నిర్దేశం చేశారు. ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అన్నారు. విద్యార్థులకు, పరిశోధకులకు అవగాహన కల్పించేందుకు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో ఈ నేషనల్ వెబినార్ ను నిర్వహించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిన్నెర కిరణ్

# విశ్వవిద్యాలయానికి గ్రంథ బహూకరణ


**05.08.21 (మీడియాసెల్)** కొంతమూరుకు చెందిన శ్రీ భండారం శంకర నారాయణ శర్మగారి జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి 45 తెలుగు,సంస్కృత గ్రంథాలను అందజేశారు. వారి కుమారులు దోసకాయలపల్లి ఉపాధ్యాయులు చక్రవర్తి, ప్రజా పత్రిక సుదర్శన్ ప్రోత్సాహంతో వారి చేతుల మీదుగా ఈ గ్రంథాలను తెలుగు శాఖ సహాయాచార్యులు డా.తలారి వాసుకి అందించారు. చక్రవర్తి మాట్లాడుతూ తమ తండ్రి గారు తెలుగు పండితులుగా ఉద్యోగం చేశారని, వారు సంపాదించుకున్న గ్రంథాలను నన్నయ విశ్వవిద్యాలయానికి అందజేయడం ద్వారా విద్యార్థులకు ఉపయోగకరం అవుతాయని భావిస్తున్నామని అన్నారు. నారాయణ శర్మగారి శ్రీమతి వేదుల కామేశ్వరి, కుమారులు నారాయణ, చక్రవర్తి తమ పుస్తకాలు నారాయణ శర్మ గారి పేరు మీదుగా విశ్వవిద్యాలయంలో ఉంటున్నందుకు సంతోషిస్తున్నామన్నారు. విలువైన గ్రంథాలను విశ్వవిద్యాలయానికి అందించినందుకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథ రావు, రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ నారాయణశర్మ గారి కుటుంబ సభ్యులకు, ప్రజా పత్రిక సుదర్శన్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



పుస్తకాలను డా. తలారి వాసుకి అందిస్తున్న చక్రవర్తి, ప్రజాపత్రిక సుదర్శన్

# సంపూర్ణ జాతీయ గీతం



వంగదేశంలో(బెంగాల్) 1861 మే 7 వ తేదీన దేవేంద్రనాథ ఠాగూర్, శారదాదేవీలకు పద్నాలుగవ సంతానంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జన్మించాడు. బాల్యం చాలా చోద్యంగా గడిచింది. ఆముదం దీపం ముందు పుస్తకం పట్టుకొని కూర్చొని ఆవలిస్తూ కునికిపాట్లు పడుతూ చదివేవాడు. నిద్ర లేవగానే ఇంటి తోటలోకి పోయి ప్రకృతి సౌందర్యాన్ని చూచి ఆనందించేవాడు. కథలంటే చెవి కోసుకొనేవాడు. సామాన్య దుస్తులతో, నిరాడంబరంగా పెరిగాడు. బాల్యంలో ఇంట్లోనే నాలుగు గోడల మధ్య ఉండవలసి రావటంతో ఆయనకు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. ప్రపంచమొక రహస్యమనీ, ఆ రహస్యాన్ని తెలుసుకోవాలనీ కుతూహలపడేవాడు.


రవీంద్రుడు పాఠశాలలో చదవడానికి ఇష్టపడక ఇంటివద్దనే క్రమశిక్షణతో ప్రతి ఉదయం వ్యాయామం చేసి, లెక్కలు చేసి, చరిత్ర, భూగోళ పాఠాలను, సాయంత్రం చిత్రలేఖనం, ఆటలు, ఇంగ్లీషు అభ్యసించేవాడు. ఆదివారాలలో సంగీత పాఠాలు, భౌతిక శాస్త్రం ప్రయోగాలు, సంస్కృత వ్యాకరణం నేర్చుకొనేవాడు. బొమ్మలున్న ఆంగ్ల నవలలను స్వయంగా చదివేవాడు. కాళిదాసు, షేక్స్పియర్ రచనలు చదివాడు. భాషను క్షుణ్ణంగా అభ్యసించి మాతృభాష పట్ల అభిమానం పెంచుకొన్నాడు.


రవీంద్రుడు ఇంగ్లాండులో ఒక పబ్లిక్ స్కూలులో చేరి, ప్రొఫెసర్ మార్లే ఉపన్యాసాలు విని ఆంగ్ల సాహిత్యంపై అభిరుచి పొంచుకొన్నాడు. సాహితీపరుల ప్రసంగాలు విని వారితో సంభాషించి నాటకాలకు, సంగీత కచేరీలకు వెళ్లి, ఆంగ్ల సంస్కృతీ సంప్రదాయాలు బాగా ఆకళించుకొన్నాడు. తన అనుభవాలను భారతికి లేఖలుగా వ్రాసేవాడు. రవీంద్రుడు ఇంగ్లండులో వుండగానే భగ్న హృదయం అనే కావ్యాన్ని రచించాడు. అయితే ఇంగ్లండులో పద్దెనిమిది మాసాలు వుండి ఏ డిగ్రీనీ సంపాదించకుండానే స్వదేశానికి తిరిగి వచ్చాడు.ఆ తర్వాత 1883 డిసెంబరు 9 న మృణాలిని దేవీని వివాహమాడాడు.

రవీంద్రుడు బాల్యంలోనే అనేక పద్యాలు, వ్యాసాలు, విమర్శలు ప్రచురించాడు. ఆయన రచించిన సంధ్యాగీత్ కావ్యాన్ని కవులందరూ మెచ్చుకొనేవారు. వందేమాతరం గీతాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీ కూడా రవీంద్రుని ప్రశంసించాడు. రవీంద్రుడు రచించిన భక్తిగీతాలను తండ్రి విని, వాటి ప్రచురణ కవసరమయిన డబ్బు ఇచ్చేవాడు. ఆ తరువాత రవీంద్రుడు విర్గరేర్ స్వప్న భంగ, సంగీత ప్రభాత అనే కావ్యాలను రచించాడు.

ఆయన రచించిన గీతాంజలి విశ్వకావ్యమైంది.గీతాంజలికి 1913 లో నోబెల్ పురస్కారం లభించింది. ఆయన రచించిన "జనగణమన.."గీతం భారత జాతీయగీతమైంది.






1.జన గణ మన అధినాయక జయహే భారత భాగ్య విధాతా!
పంజాబ, సింధు,గుజరాత, మరాఠా,ద్రావిడ, ఉత్కళ, వంగా
వింధ్య హిమాచల యమునా గంగా,
ఉచ్ఛల జలధి తరంగా తవశుభ నామే జాగే,తవ శుభ ఆశిష మాగే,
గాహే తవ జయగాథా!
జన గణ మంగళదాయక జయహే భారత భాగ్య విధాతా!
జయహే, జయహే, జయహే, జయ జయ జయ జయహే!!

2.అహరహ తవ ఆహ్వాన ప్రచారిత శుని తవ ఉదార వాణీ
హిందు, బౌద్ధ, సిఖ్,జైన,పారసిక, ముసల్మాన్ క్రిష్టానీ
పూరబ్ పశ్చిమ ఆసే,
తవ సింహాసన – పాశే
ప్రేమహార హయ గాథా!
జన గణ ఐక్య విధాయక జయహే, భారత భాగ్య విధాతా!
జయహే, జయహే, జయహే, జయ జయ జయ జయహే!

3.పతన అభ్యుదయ, బంధుర పంథా, యుగ,యుగ ధావిత యాత్రీ
హై చిర సారథి తవ రథచక్రే ముఖరిత పథ దినరాత్రి!
దారుణ – విప్లవ మాఝే, తవ శంఖధ్వని బాజే
సంకట దుఃఖం త్రాతా!
జన గణ పథ పరిచాయక జయహే, భారత భాగ్య విధాతా!
జయహే, జయహే, జయహే, జయ జయ జయ జయహే!

4.ఘోర తిమిర ఘన నిబిడ నిశీథే పీడిత మూర్ఛిత దేశే
జాగ్రత చిల తవ అవిచల మతగల జతనయనే అనిమేషే!
దుఃస్వప్నే ఆతంకే రక్షా కరిల అంకే
స్నేహమయీ తుమి మాతా! జన గణ దుఃఖ త్రాయక జయహే, భారత భాగ్య విధాతా!
జయహే, జయహే, జయహే, జయ జయ జయ జయహే!

5.రాత్రి ప్రభాతిల, ఉదిల రవి ఛవి పూర్ణ ఉదయగిరి భాలే, గాహే విహంగమ, పుణ్య సమీరణ నవజీవన రస ఢాలే!తవ కరుణారాగే నిద్రిత భారత జాగే
తవ చరణే నత మాథా
జయ జయ జయహే,జయ రాజేశ్వర భారత భాగ్య విధాతా!
జయహే, జయహే, జయహే, జయ జయ జయ జయహే!

**భావం :**

1.సమస్త జన సమూహముల మనస్సులను శాసించువాడవును, భారతదేశపు భవితవ్యమును నిర్ణయించువాడవునగు ఓ పరమేశ్వరా! పంజాబు మొదలుగాగల (పంజాబ్, సింధు, గుజరాత్, మహారాష్ట్ర, ద్రావిడ, ఉత్కళాది) ప్రాంతములు,వింధ్య హిమాలయాది పర్వతములు గంగా యమునాది నదులు పైకెగయు సాగరతరంగాలుగా నీ పవిత్రనామంతోనే మేల్కొనుచు నీ పవిత్ర ఆశీస్సులను కోరుచున్నవి. (ఆయా ప్రాంతాల ప్రజల హృదయాలు నీ నామస్మరణతో జాగృతమగుచున్నవి. ఆయా పర్వతాలలో నీ నామం ప్రతిధ్వనిస్తుంది. ఆయా నదీ ప్రవాహ సంగీతంలో నీ నామం గానం చేయబడుచున్నది. సముద్ర తరంగాలు నీ నామమే ఉచ్చరిస్తున్నాయి)నీ విజయ గాథలనే గానం చేస్తున్నాయి. జనసమూహములకు శుభములను గూర్చునో భారత భాగ్య నిర్ణేతా! నీకు జయమగుగాక!

2. హిందువులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పారశీకులు, ముస్లిములు, క్రైస్తవులు... మొదలగు వివిధ మతస్థులైన ప్రజలను ఆహ్వానించుచు అహోరాత్రులు నీ స్వరము సకల ప్రాంతముల వ్యాపించుచున్నది. ప్రాక్పశ్చిమముల నుండి
ప్రేమమాలగా కూర్పబడుటకై నీ పాద పీఠిచెంత పూజా కుసుమములర్పించబడుచున్నవి.
సకల జన సమైక్యతా నిర్దేశకుడవు, భారత భాగ్య నిర్ణేతవగు ఓ పరమేశ్వరా! నీకు జయమగుగాక!

3. జాతుల ఉత్థాన పతనములతో రాటుదేలిన మార్గమున మానవేతిహాస రథమును నడిపించు ఓ నిరంతర సారథీ! ఆందోళనలు ఉత్పాతముల నడుమ నిరాశతో క్రుంగువారికి నీ శంఖధ్వని ధైర్యమునిచ్చి కష్టాలలో జీవితయాత్రలో మార్గదర్శనం చేయుచున్నది. సంకటముల నుండి రక్షించు ఓ పరమేశ్వరా! నీకు జయమగు గాక!

4. ఘోర నిశీథ నిబిడాంధకారమున క్రుగ్గి మూర్ఛితురాలైన దేశమాత ముఖమును నీ అనిమేష జాగృత నయనాలతో వీక్షించి స్నేహపూర్ణ మాతృహస్తమునందించి నిరాశావహ దుస్స్వప్న తమస్సులనుండి రక్షించు ఓ పరమేశ్వరా!భారత భాగ్య నిర్ణేతా!నీకు జయమగు గాక!

5.రాత్రి తొలగి ఉదయగిరిపై సూర్యుడుదయించుటతో పక్షుల గానము, ప్రభాత వాయువులు జీవితమున నవజీవనరసమునుగొని వచ్చుచున్నవి.నీ ప్రేమామృత కరస్పర్శతో భారతజాతి
జాగృతమై నీ పాదముల మ్రోల శిరస్సు వంచుచున్నది. రాజాధిరాజువును భారత భాగ్య నిర్ణేతవునగు ఓ పరమేశ్వరా! నీకు జయమగు గాక!




**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధే జక్కంపూడి రామ్మోహనరావుకు నిజమైన నివాళి :**
**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**

**నన్నయ వర్సిటీలో జరిగిన జక్కంపూడి రామ్మోహనరావు 68వ జయంతి వేడుకలను nannaya news tv ద్వారా వీక్షించండి.**

**యాంకర్ - కె.రాశిత పావని, ఎమ్మెస్సీ. (మ్యాథమెటిక్స్)**